క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. భక్తులు అధిక సంఖ్యంలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

భీమవరం వాసికి డాక్టరేట్


దేవకృపానంద రావు

నంద్యాల(న్యూటౌన్): మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన దేవకృపానంద రావుకు శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఆదివారం డాక్టరేట్ పొందిన ఆయన మాట్లాడుతూ ఎస్కే యూనివర్సిటీ కామర్స్ విభాగంలో ప్రొఫెసర్ కేవీ రమణారెడ్డి పర్యవేక్షణలో రోల్ ఆఫ్ మైక్రో ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్ ఏ స్టడీ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించడంతో యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, ఆర్థిక స్వావ లంభన కోసం వివిధ మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఎలా పని చేస్తున్నాయో సమగ్రంగా పరిశోధించానని వివరించారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి


ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివిని నంద్యాల జిల్లా బీజేపీ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ అభిరుచి మధు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిమ్మకాయల సుధాకార్, తాడి రామకృష్ణారెడ్డి, బత్తిని స్వాతి, కశెట్టి చంద్రశేఖర్, నాగమద్దిలేటి, చల్ల మధు, గాండ్ల ఈశ్వర్ పాల్గొన్నారు.

మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలి


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న క్లర్క్, అకౌంటెంట్లకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 165 మోడల్ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న క్లర్క్ కమ్ అకౌంటెంట్లకు కాంట్రాక్ట్ పద్ధతిలో విలీనం చేసి జీవో ప్రకారం మినిమమ్ టైం స్కేల్ ఇప్పించాలని కోరారు. 10 సంవత్సరాలకు పైగా చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం స్పందించాలని అభ్యర్థించారు. ఈశ్వరరెడ్డి, సుధాకర్, జనార్దన్ రెడ్డి, నిర్మల, మాధవి, సుకన్య, నాగరాజు, వెంకటేష్, సుబ్బమ్మ పాల్గొన్నారు.

వేలంలో ఆలయాలకు ఆదాయం

శిరివెళ్ల: కోటపాడులోని శ్రీ వీరభద్ర, చెన్న కేశవ స్వామి ఆలయాల మాన్యం కౌలుకు ఏడాది కాల పరిమితికి గాను ఆదివారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఇందులో ఆలయాలకు గతేడాది కంటే రూ.4.76 లక్షలు అదనంగా ఆదాయం సమకూరింది. నిరుడు రూ. 22.04 లక్షలకు వేలం పోగా.. ప్రస్తుతం రూ.26.80 లక్షలకు రైతులు సొంతం చేసుకున్నారు. ఈఓ వేణునాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ అధికారులను కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్య, పంచాయతీ అధికారులు సందర్శించి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సరిగ్గా చేపట్టకపోవడంతో కలుషితమైన నీరు తాగడం వల్ల ప్రజలు అతిసార వ్యాధి సోకి ప్రాణాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బనగానపల్లె, నందికొట్కూరు, చాబోలు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సరిగా లేకపోవడం వల్లనే అతిసార వ్యాధులు ప్రబలాయని తెలిపారు. మరణించిన కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సోమన్న, ధనుంజయుడు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- సీజనల్ వ్యాధుల నుంచీ రక్షణ
- వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాల్సిన సమయం
- వైద్యుల సలహాలు పాటించాల్సిందే..
- వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదు. ఎంత డబ్బున్నా ఆరోగ్యం లేకపోతే ఏమీ తినలేని పరిస్థితి. మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండాలంటే తిండి, నీరు, శుభ్రత ముఖ్యం. శరీరానికి అవసరమైన మేర విటమిన్లు,ప్రొటీన్లు అందేలా పౌష్టికాహారం, స్వచ్ఛమైన నీరు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ఎంతో అవసరం.

నంద్యాల(న్యూటౌన్): వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. రోజువారీగా పోషకాలతో కూడిన ఆహారాన్ని శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు.ప్రతిపూట భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం, కాచి వడబోసిన నీటిని తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు.

వీటికి దూరంగా ఉండాలి..

నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు అధికంగా తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి..

పరిశుభ్రమైన నీటిని తాగాలి, సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవడం ఉత్తమం. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీమీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఒకటి రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు.


తాజా కూరగాయలు

తాజా కూరలు, పండ్లు..

రోజుకు కనీసం ఒక రకం పండు తీసుకోవాలి. ముఖ్యంగా యాపిల్, అరటి, జామ, బొప్పాయి తదితర రకాలను తీసుకోవాలి. వీటిని తినడం ద్వారా ఆహారం ద్వారా తక్కువైన విటమిన్లు, ప్రొటీన్లు శరీరానికి అందుతాయి. అలాగే శరీరంలో నీటి శాతాన్ని నిలకడగా ఉంచడంలో పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి.



- ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం, కొంచెం ప్రతి మూడు గంటలకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం.
- రోజు వారి ఆహారంలో తాజా ఆకుకూరలు, కూర గాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూర గాయాలు, పండ్లలో ఉండే సూక్ష్మ, పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.
- పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

మంచి ఆహారం తీసుకోవాలి



ఆహారం బాగా ఉడికించి తినాలి. ఏ, సీ, డీ, కే విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు, అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోస సంబంధ వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పనిచేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడ విటమిన్లు అందుతాయి.

– డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్ఓ, నంద్యాల

రోజువారీ ఆహారం ఇలా..



ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలి. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవేవీ అందుబాటులో లేకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు కూరగాయాలతో తినాలి. ఒక వేళ కూరగాయ, పెరుగు వద్దనుకున్నప్పుడు 100 గ్రాముల మాంసాహారం ఉండాలి.

పప్పు ధాన్యాలు..



ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి, జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తినాలి.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడంలో భాగంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను బడుల్లో చేర్పించేందుకు కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం పీవీ ప్రసాద్ అధ్యక్షతన స్థానిక పీజీ కళాశాలలో యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను వదిలి విద్యార్థులు వలస పోతున్నారని, పాఠశాలల్లో కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. యాప్‌లు, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి పాఠశాలలను రక్షించుకోవడానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఎంవీ సుబ్బారెడ్డి, సత్యప్రకాష్, షమీమ్‌భాను, రామానందకిశోర్, రామకృష్ణుడు, సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుత్తులుగా పనస కాయలు

ఆత్మకూరురూరల్: సహజంగా కొన్ని రకాల ఫలాల నిచ్చే వృక్షాలు పరిమితమైన ప్రాంతాల్లో మాత్రమే మన్న గలుగుతాయంటారు. ఉదాహరణకు ఆపిల్ పండ్లు కశ్మీర్, హిమాచల ప్రదేశ్ లాంటి శీతల ప్రదేశాలలో మాత్రమే కాస్తాయి. అలాగే పనస మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్రలో మాత్రమే కాస్తుంది. కానీ చిత్రంగా ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామ శివార్లలో ఉన్న వైఎస్సార్ స్మృతివనంలో పనస చెట్టు ఏపుగా పెరగడమే కాకుండా గుత్తులు గుత్తులుగా కాయలు కాశాయి. పండ్ల గుత్తులను సందర్శకులు అబ్బురంగా చూస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

శిరివెళ్ల: సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ నాయక్ వసీం సూచించారు. ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున వాటర్ ట్యాంక్‌లు,కుళాయిలలో కొత్త నీరు వచ్చి చేరుతుందన్నారు. అలాగే నీరు నిల్వ చేరి ఉండటంతో దోమల బెడద పెరిగిందని, వీటి కారణంగా అతిసారా, డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రజలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. వర్షా కాలంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఎంఈఓ శంకరప్రసాదు మాట్లాడుతు 2024-2025 విద్యా సంవత్సరానికి గాను మండలానికి 30, 774 పాఠ్య పుస్తకాలు, 3,086 బెల్టులు మంజూరవగా వాటిని విద్యార్థులకు అందజేశామన్నారు. పశువైద్యాధికారి దస్తగిరి మాట్లాడుతూ పశువులకు గొంతు వ్యాపు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నామని సభ దృష్టికి తెచ్చారు. ఏఓ సుధాకర్ మాట్లాడుతు ఈ ఏడాదికి 1,702 మంది రైతులకు 580 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేశామని, 115 - 150 హెక్టార్లలో మినుము, పెసర, మొక్కజొన్న పంటలు సాగయయ్యాయని వివరించారు. ఖరీఫ్, రబీకి సంబంధించి ఎరువుల సరఫరాకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ నర్సిరెడ్డి, ఈఓఆర్డీ నాగేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆత్మీయ సమ్మేళనం

చాగలమర్రి: స్థానిక ఎస్‌పీజీ క్రైస్తవ మిషనరీ ఉన్నత పాఠశాలలో 2006-07లో 10వ తరగతి అభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ప్రధానోపాధ్యాయురాలు నళిని ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 40మంది హాజరయ్యారు.18 సంవత్సరాల తరువాత చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. అనంతరం మృతి చెందిన పూర్వపు ఉపాధ్యాయులు పెద్దయ్య, అగస్టీన్, సుందరరావు, బోస్ అందించిన సేవలను కొనియాడి, వారి మృతికి సంతాపం తెలిపారు. తదనంతరం పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు జానీ, జయరాముడు, హేమంత్, రాఘవ, సుబ్బ నరసింహుడు, వెంకటేష్, షేక్. హుసేన్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని 29 వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాను దుర్భాషలాడి బెదిరింపులకు పాల్పడిన 8 మంది టీడీపీ నాయకులపై ఆదివారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక 29వ వార్డులో శనివారం ముఖ్యమంత్రి , ఉపముఖ్యమంత్రి ఫొటోలతో సచివాలయానికి వెళ్లి టీడీపీ నాయకులు హల్‌చల్ చేశారు. అక్కడే ఉన్న చైర్‌పర్సన్ ఫొటోలను అధికారుల ద్వారా ఏర్పాటు చేయిస్తామని చెప్పడంతో టీడీపీ నాయకులు ఆవేశంతో ఆమెను దుర్భాషలాడారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు మంజుల సుబ్బరాయుడు, తిమ్మయ్య, రామకృష్ణ, బబ్లు, శివశంకర్ యాదవ్ మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అయితే టీడీపీ నాయకులను కులం పేరుతో మాబున్నిసా దూషించనప్పటికీ టీడీపీ నాయకులు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయటం గమనార్హం.

చైర్‌పర్సన్‌పై అట్రాసిటీ కేసు పెట్టడం అన్యాయం

నంద్యాల(అర్బన్): నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఎస్సీ,ఎస్టీ, అట్రాసిటీ కేసు పెట్టడం అప్రజాస్వామికమని, న్యాయశాఖ మంత్రిగా ఉన్న ఎన్ఎండీ ఫరూక్ ముస్లిం అయి ఉండి ముస్లిం మహిళపై కేసులు పెట్టడం సరైంది కాదని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి మస్తాన్‌వలి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్‌పర్సన్‌కు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చైర్‌పర్సన్‌పై పెట్టిన కేసును విత్‌డ్రా చేయించాలని సూచించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో పీఎం, సీఎం, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు పెట్టడంలో తప్పు లేదని, అధికారుల ఆధ్వర్యంలో ఫొటోలు పెట్టాలి కాని, టీడీపీ నాయకులు కార్యాలయాల్లోకి వెళ్లి ఫొటోలు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. సచివాలయాలు ప్రభుత్వ కార్యాలయాలే కాని పార్టీ కార్యాలయాలు కాదని అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రహించాలని హితవు పలికారు.

స్నేహితుడిపై కత్తిదాడి

- కూలి విషయంలో ఇద్దరి మధ్య గొడవ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం సమీపంలో రవి అనే వ్యక్తిని స్నేహితుడు కత్తితో పొడిచిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన రవి, శేఖర్ స్నేహితులు. ఇద్దరూ రోజు వారి కూలీ పనికి వెళ్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య కూలి విషయంలో గొడవ మొదలైంది. ఈ క్రమంలో శేఖర్ తన వద్ద ఉన్న కత్తితో రవిని పొడిచి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న రవిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి

- రైతన్నకు విత్తు సమస్య


ఉయ్యాలవాడలో వేరుశనగ సాగు చేస్తున్న రైతు

ఉయ్యాలవాడ : మండలంలో ఖరీఫ్ సీజన్ ఊపందుకుంది. ఐదు రోజుల క్రితం భారీ వర్షం కురిసింది. 109.6 ఎం.ఎం., వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 63 ఎం.ఎం., కాగా ఈ నెలలో ఇప్పటికే 165 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ సారి వర్షాధార పంటల్లో మొక్కజొన్న, మిరప, పసుపు, వేరుశనగ, కందులు, మినుములు, పెసలు మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతున్నాయి. దీంతో రైతన్నలు మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ రకాలు సాగు చేస్తే దిగుబడులతో పాటు మంచి ధర లభిస్తుందని, కేంద్ర ప్రభుత్వం కూడా ఇటీవల ఆయా ఉత్పత్తులకు సంబంధించి ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఖరీఫ్ సీజన్‌లో 2,724 హెక్టార్లలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, మిరప, పత్తి, కంది, మినుము, సోయాబీన్, పొగాకు, జొన్న పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది పుచ్చకాయలపల్లె, సర్వాయిపల్లె, ఉయ్యాలవాడ గ్రామాల్లో కొందరు రైతులు వేరుశనగ పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతూ విత్తనం వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే మండల పరిధిలోని 11 రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రభుత్వ విధి విధానాలపై పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై స్థానిక మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు రైతు భరోసా కేంద్రాలకు జీలుగు విత్తనాలు తప్పా ఇతర రకాల విత్తనాలు సరఫరా కాలేదని తెలిపారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక మిట్టపల్లె గ్రామంలో మృతి చెందిన అనకాల శ్రీనివాసులు కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన రోజు నుంచి వైఎస్సార్‌సీపీ ఓటమి ఎలా చెందిందో అర్థం కావడం లేదని మనస్థాపంతో ఇంట్లో నుంచి బయటకు రాకుండా గడిపిన శ్రీనివాసులు శనివారం టీవీలో అసెంబ్లీ సమావేశాలు చూస్తూ ఒక్కసారిగా ఉద్వేగానికి లోనై బయటకు వచ్చి అక్కడ ఉన్న వారిని పట్టుకుని విలపించాడు. ఏదో మోసం జరిగింది జరిగింది అంటూ ఇంట్లోకి వెళ్లి అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామం చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

గెలివికి 'తాటిమాను' పురస్కారం


ప్రసంగిస్తున్న నివర్తి మోహన్

నంద్యాల(వ్యవసాయం): లలితకవి తాటిమాను నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని తాటిమాను కుటుంబసభ్యులు గెలివి సహదేవుడుకు అందజేసి సత్కరించారు. ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో సరసకవి గెలివి సహదేవుడికి ఈ పురస్కారం అందజేశారు. అలాగే సూరన సారస్వత సంఘం సహ కార్యదర్శి కోడూరి శేషఫణి శర్మ రచించిన నా స్వామి పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన రామకృష్ణారెడ్డి , నివర్తి మోహన్, పాణ్యం శ్రీనివాస్, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ తదితరులు మాట్లాడుతూ గెలివి సహదేవుడు నాలుగు దశాబ్దాలుగా నంద్యాలలో సాహితీ ప్రాభవానికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం కోడూరి శేషఫణిని ఘనంగా సత్కరించారు. అన్నెం శ్రీనివాసరెడ్డి, నీలం వెంకటేశ్వర్లు, గూటూరి చంద్రశేఖర్, తాటిమాను మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

నువ్వు ఇక్కడి దాకా.. నేను అక్కడి వరకు!

- యథేచ్ఛగా తెలుగుగంగ కాల్వ గట్ల ఆక్రమణ
- ఒప్పందం చేసుకొని ఆక్రమించి పంటలు సాగు చేస్తున్న రైతులు


బి.నాగిరెడ్డిపల్లె మెట్ట-అప్పనపల్లె మధ్య 19వ బ్యాక్ కాల్వ కట్టపై సేద్యం చేసిన దృశ్యం

రుద్రవరం: తెలుగుగంగ కాల్వ కట్టలు ఆక్రమణకు గురవుతున్నాయి. కొందరు కొన్ని చోట్ల కట్టలను ఆక్రమించి పంటలు సాగు చేయడం చూసి మిగిలిన రైతులు కూడా వారినే అనుసరిస్తున్నారు. దీంతో కాల్వకు కట్ట లేకుండా పోతోంది. నీటి ప్రవాహం పెరిగితే పొలాల్లో ప్రవహించి పంటలు మునకకు గురవుతున్నాయి. అలాగే నీరు సరిపడనంతగా దిగువకు వెళ్లడం లేదు. ఇక కౌలుకు తీసుకున్న రైతులు అదనంగా వచ్చే పొలంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఆశతో వారు కాల్వ కట్టల ఆక్రమణకు తెగబడుతున్నారు. సొంత పొలంతో పాటు కౌలుకు పొలం దొరక్కపోతే చుట్టు పక్కల ఎక్కడైనా ఖాళీ భూమి ఉంటే వాటిని చదును చేసి పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని బీ.నాగిరెడ్డిపల్లె మెట్ట నుంచి అప్పనపల్లె మధ్యలో ఉన్న 19వ బ్లాక్ తెలుగుగంగ ఉప ప్రధాన కాల్వ కట్టపై కొందరు రైతులు సేద్యపు పనులు పూర్తి చేసి విత్తు విత్తేందుకు సిద్ధమయ్యారు. కట్టపై ఎలాంటి వివాదాలు తలెత్తకుండా రైతులు సామరస్యంగా చర్చించుకొని నువ్వింత వరకు.. నేనింత వరకు.. అంటు ముళ్ల కంపను హద్దుగా వేసుకున్నారు. దీంతో కాలువలు కుంచించుకుపోయి చిన్నవిగా మారి దిగువకు నీరు పారడం లేదని కిందనున్న రైతులు వాపోతున్నారు.


కట్టపై హద్దుగా వేసుకున్న ముళ్ల కంప

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతాం


చాగలమర్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడతామని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మహబూబ్‌బా సోదరి వివాహానికి చాగలమర్రికి విచ్చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అలవికాని వాగ్దానాలతో రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం పాలన సజావుగా కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభం సమయానికే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి, ఖరీఫ్ సాగుకు రైతులకు రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించిందన్నారు. విద్యా సంవత్సరం, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటికీ ప్రభుత్వం ఆయా అంశాల మీద చర్చ చేయకపోవడం దురదృష్టకమన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 15 రోజులు కూడా గడవక ముందే వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను కూలదోయడం ప్రారంభించింది. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వ ఉద్దేశమేంటో స్పష్టమవుతోందన్నారు. కేవలం కక్షపూరితంగా, హింసాత్మక ఘటనలకే ప్రాధాన్యమని చెప్పినట్లయ్యిందన్నారు. ఇక తమ పార్టీకి ఓటు వేయలేదని గ్రామాల్లో సాధారణ ప్రజలపై దాడులకు తెగబడటం ఎంతవరకు సమంజసమన్నారు. నిరంకుశ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తే తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అధికారంలో ఉన్నా లేక పోయినా పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటామని, నియోజక అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామని చెప్పారు. పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల అధ్యక్షుడు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, ఉప సర్పంచ్ షేక్.మహమ్మద్ సోహెల్. సర్పంచ్ గోవిందయ్య ఉన్నారు.